నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చందానగర్: హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇంద్రసేనారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో మార్తాండనగర్, హనీఫ్‌కాలనీ, ప్రేమ్‌నగర్ బీ బ్లాక్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు గచ్చిబౌలి ఏఈ వెంకట్ నారాయణ రెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రశాంతిహిల్స్, ఎంజేఆర్ దాబా, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు రాయదుర్గం, మధురానగర్, పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాలు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో. టమాటా రూ. 35, పచ్చిమిర్చి 70, బెండ 55, కాకర 55, దొండ 50, దోస 30, ఆలు 25, చామ 50, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 60, బీన్స్ 100, బీట్‌రూట్ 40, క్యాప్సికం 80, క్యాబేజీ 30, క్యారెట్ 50, చిక్కుడు 80, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

సేఫ్టీ స్పెషల్ డ్రైవ్



రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీలో మంగళవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో సేఫ్టీ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ సింధురెడ్డి హాజరయ్యారు. కాలనీకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేశారు. కాలనీలోని పార్కులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో రోడ్లపై గుంతలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలోని కాలనీల్లో పార్కుల అభివృద్ధి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి వినతి పత్రం ఇస్తున్న కాలనీవాసులు

చందానగర్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్ డబుల్ బెడ్రూం ఇండ్ల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇండ్ల చుట్టూ ప్రహరీ నిర్మించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్లు, తాగునీటి కోసం బోరు వేయించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలో కాలనీలో పర్యటించి పరిష్కరిస్తానని హామీనిచ్చారు. వినతి పత్రం అందించిన వారిలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదేశ్ కుమార్, ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, సక్రూ, నర్సింహారెడ్డి, శ్యాం, నర్సింహులు, కుర్మయ్య, మహేందర్, సాయిరాం, సూర్య, సభ్యులు తదితరులు ఉన్నారు.

సున్నం చెరువులో హైడ్రా అధికారుల సర్వే



డిజిటల్ సర్వే చేస్తున్న హైడ్రా అధికారులు

మాదాపూర్: హైకోర్టు ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు మాదాపూర్‌లోని సున్నం చెరువు డిజిటల్ సర్వేను మంగళవారం చేపట్టారు. చెరువు బౌండరీలను పూర్తిస్థాయిలో సర్వే చేయకుండా చెరువు పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న గుడిసెలను నేలమట్టం చేస్తున్నారని సియేట్‌కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సున్నం చెరువు 30,31 అల్లాపూర్ సర్వేనంబర్, గుట్టలబేగంపేట్ సర్వేనంబర్ 12, 12ఏ, 13లను డిజిటల్, బౌండరీల సర్వే చేశారు. గుట్టలబేగంపేట్ సర్వేయర్ డీఈ జగదీశ్వర్, అల్లాపూర్ సర్వేయర్ డీఈ శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

కల్లు దుకాణాలపై దాడులు



శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల వ్యాప్తంగా ఉన్న 17 కల్లు దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. ఈ సందర్భంగా కల్తీ కల్లు విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో గుమ్మడిదల మండలంలోని పలు కల్లు దుకాణాల్లో తనిఖీలు చేసి శాంపిల్స్ సేకరించారు. కల్తీ కల్లు విక్రయాలు జరిపినట్లు శాంపిల్స్ రిపోర్టులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీకల్లు విక్రయాలను మానుకోవాలని లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 12 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా ఏడుగురికి ఒక్కొక్కరికీ రూ. వెయ్యి, మరో ముగ్గురికి రూ.1500, ఒకరికి రూ. 2వేలు, మరో వ్యక్తికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అంగన్‌వాడీకేంద్రంలో 'బ్లూ డే'



కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, చిన్నారులు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో 'బ్లూ డే' కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ జ్యోతి బ్లూ కలర్‌పై చిన్నారులకు అవగాహన కల్పించారు. అంతేగాకుండా బ్లూ రంగు కాగితంలో పడవ, ఇతర ఆకృతులు తయారు చేయించారు. అలాగే వ్యర్థాలతో రకరకాల ఆకృతులను తయారు చేసి వాటికి రంగులు వేసి వారు మెడలో ధరింపజేశారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో తీరిన తాగునీటి సమస్య



మోటారును బాగు చేస్తున్న దృశ్యం

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి తిప్పలు తప్పాయి. మాణిక్‌రెడ్డి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు సంజీవరెడ్డి పర్యవేక్షణలో మంగళవారం విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు మోటారును బాగు చేయించి బోర్‌కు బిగించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. రూ.9 వేల వ్యయంతో అసోసియేషన్ ఆధ్వర్యంలో పనులు చేపట్టామని వారు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు, జల మండలి అధికారులతో కలిసి న్యూ కాలనీలో మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో చేపట్టాల్సిన పనులు, సమస్యలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ..చేపట్టాల్సిన పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. డ్రైనేజీ, తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఈఈ ఇందిరాబాయి, డీఈ దుర్గాప్రసాద్, జల మండలి డీజీఎం నారాయణ, మేనేజర్ సునీత, ఏఈ సంతోష్, కాలనీవాసులు ఉన్నారు.

వరదనీటి కాలువ పనుల పరిశీలన

అల్లూరి సీతారామరాజు కాలనీలో వరదనీటి కాలువ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఈఈ ఇందిరాబాయితో కలిసి పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సురేశ్‌బాబు

గచ్చిబౌలి: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని రోటరీ క్లబ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబు పేర్కొన్నారు. కొండాపూర్ రాఘవేంద్ర కాలనీలోని సంస్కృతి హైస్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను రోటరీ క్లబ్ సేవల ప్రణాళిక పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలతో పాటు కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో కూడా తమ కార్యక్రమాలను విస్తరిస్తున్నామన్నారు. సోషల్ మీడియా, టీవీ, ఫోన్, సిగరెట్, గుట్కా, గంజాయి, డ్రగ్స్ లాంటివి యువతకు పెద్ద శత్రువులని వాటికి దూరంగా ఉంటేనే బంగారు భవిష్యత్‌కు బాటలు పడుతాయన్నారు. సంస్కృతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసే కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యదర్శి వనశ్రీ మాట్లాడుతూ..తల్లిదండ్రులు, సమాజాన్ని గౌరవించాలన్నారు. కార్యక్రమంలో సంస్కృతి గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ లక్ష్మణ్ మన జాగృతి కమిటీ సభ్యులు డాక్టర్ చల్లా గీత పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చందానగర్: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన చందానగర్ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడకు చెందిన వడపర్తి శేఖర్ (45) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి 15 ఏళ్ల క్రితం చందానగర్‌కు వచ్చి ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం బయటకు వెళ్లాడు. సాయంత్రం అయిన ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇంటికి వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతకలేదు. అదేరోజు రాత్రి చందానగర్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని తీవ్ర గాయాలై శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. విచారణలో భాగంగా ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మియాపూర్: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మియాపూర్ మెట్రోస్టేషన్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు మెట్రో సిబ్బంది పోలీసులకు మంగళవారం మధ్యాహ్నం సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతిచెందాడు. వయస్సు సుమారు 40–45 ఉంటుందని, చుట్టుపక్కల ఆరాతీయగా కొంతకాలంగా భిక్షాటన చేస్తూ ఇక్కడే ఉంటున్నాడని తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.